

మహా జోష్..!

టీడీపీ శ్రేణుల పండుగ.. పసుపుదళం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తెలుగు తమ్ముళ్ల సమ్మేళనం మహానాడు. తెలుగునాట ఆరాధ్య నటుడు ఎన్టీఆర్ 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఆనాటి నుంచి తారకరాముడు పుట్టిన రోజు మే 28న మహానాడును ఓ పండుగలా నిర్వహిస్తూ వస్తున్నారు. 43వ మహానాడు పండుగను ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహానాడుకు ముందు నియోజకవర్గాల కేంద్రాల్లో మినీ మహానాడు, జిల్లా మహానాడు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. నియోజకవర్గాల్లో చేసిన తీర్మానాలు జిల్లా మహానాడుకు పంపుతారు. ఆ తీర్మానాలు క్రోడీకరించి జిల్లా మహానాడులో తీర్మానం చేసి.. రాష్ట్ర మహానాడుకు పంపుతారు. నేడు కర్నూలు జిల్లా మహానాడును నందికొట్కూరు రోడ్డులోని కమ్మ సంఘం కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నగరంలో రైల్వే స్టేషన్‌రోడ్డు ఐదు రోడ్ల కూడలి, రాజ్ విహార్ సర్కిల్, కలెక్టరేట్ సర్కిల్, నంద్యాల చెక్‌పోస్ట్ సర్కిళ్లు టీడీపీ జెండాలతో పసుపు మయమయ్యాయి.

- నేడు జిల్లా స్థాయి మహానాడు
- 5 వేల మందితో నిర్వహించేలా సన్నాహాలు
- జిల్లా అభివృద్ధిపై పలు తీర్మానాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి





ఎంపీతో కలిసి ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు, మే 21 (ఆంధ్రజ్యోతి): మహా పండుగను పుస్కరించుకొని ఆదివారం కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాలు, మంగళవారం ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలు, బుధవారం పత్తికొండ నియోజకవర్గంలో మినీ మహానాడు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడు పండుగలు ఘనంగా నిర్వహించారు. తెలుగు తమ్ముళ్లలో జోష్, ఉత్తేజం నింపేలా నిర్వహించారు. అందుకు దీటుగా జిల్లా మహానాడును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి దాదాపుగా 500 మందికిపైగా కార్యకర్తలు, నాయకులు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రుచికరమైన భోజనాలు వడ్డించనున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకేపోగు ప్రభాకర్, తెలుగుయువత నాయకుడు కేఈ రుద్రఫణీగౌడ్, న్యాయవాది ప్రసాద్ సహా పలువురు నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కందనవోలు ప్రగతిపై ఈ తీర్మానాలు చేయాలి

- హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై వేగవంతంగా అడుగులు వేయడంపై ధన్యావాదాలు, త్వరలోనే బెంచ్‌ను ప్రారంభించాలి
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుబంధంగా హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి పరిశ్రమలు తీసుకురావాలి
- జిల్లాలో టమోటా, ఉల్లి, పత్తి రైతులకు గిట్టుబాటు ధర, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.
- పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు నివారణకు వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టులు తక్షణమే చేపట్టాలి.
- పులికనుమ జలాశయం 1.75 టీఎంసీలు నుంచి 3 టీఎంసీలకు సామర్థ్యం పెంచుతూ తుంగభద్ర నుంచి అదనపు పైపులైన్ వేయాలి.
- హంద్రీనీవా కాలువకు 18 ప్రాంతాల్లో తూములు ఏర్పాటు చేసి అదనంగా 16 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి.
- కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ప్రధాన కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలి.
- కర్నూలు నగరం స్మార్ట్‌సిటీగా అభివృద్ధికి తక్షణ కార్యాచరణ అమలు పరచాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్‌కు నిధులు ఇచ్చి పనులు చేపట్టాలి.. ప్రతి ఇంటికి కొళాయి సౌకర్యం కల్పించాలి.
- బాదుడే బాదుడు సభల్లో అధినేత చంద్రబాబు, యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలి.
- ఆదోని నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ఆదోని మెడికల్ కాలేజీ పనులు చేపట్టాలి. ఆదోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి శాశ్వత భవనాలు నిర్మాణాలు చేపట్టాలి.
- ఇల్లు లేని పేదలకు 3 సెంట్లు ఇంటి పట్టా, ఎన్టీఆర్ పక్కా ఇల్లు నిర్మాణం, ఏపీ టిడ్కో ఇళ్ల తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలి.
- కేసీ కాలువ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టాలి.
- అసంపూర్తిగా ఆగిపోయిన ఉర్దూ విశ్వవిద్యాలయం, క్లస్టర్ యూనివర్సిటీ, రాయలసీమ వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ శాశ్వత భవనాలు పనులు మొదలు పెట్టి పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి.
- మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి క్షేత్రం, ఉరుకుంద శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, ఎల్లార్తి క్షేత్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు చేయాలి.
- కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ అసంపూర్తి భవనాలు పూర్తి చేయాలి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.
- ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత టీడీపీలో చేరిన వైసీపీ నాయకులకు కాకుండా.. ఐదేళ్ల ప్రతిపక్షంలో పార్టీ కోసం ప్రాణాలొడ్డిన, శ్రమించిన టీడీపీ శ్రేణులకే నామినేటెడ్ పదవులు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలి.



పకడ్బందీగా జిల్లా మహానాడు



టీడీపీ కార్యకర్తల పండుగ మహానాడు. నా ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి జిల్లా మహానాడు ఇది. పకడ్బందీగా, ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు సహా పార్టీ ముఖ్యనాయకులు హాజరవుతారు. 5 వేల మందికిపైగా రావచ్చని అంచనా వేసి ఆ మేరకు వసతి, భోజన ఏర్పాట్లు చేశాం. కడపలో జరిగే మహానాడుకు ముందు నిర్వహించే పండుగ ఇది. ప్రజా ప్రతినిధులు, నాయకులు సమష్టి కృషితో విజయవంతం చేస్తాం. జిల్లా అభివృద్ధి కాంక్షిస్తూ దాదాపుగా 20 తీర్మానాలు చేసి మహానాడుకు పంపుతాం.

- పి. తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఏపీఈఏపీ సెట్‌లో గందరగోళం

- బైపీసీ స్ట్రీమ్ విద్యార్థికి ఎంపీసీ ప్రశ్నాపత్రం
- విస్తుపోయిన మధుచరణ్‌గౌడ్
- న్యాయం చేయాలంటున్న బాధిత విద్యార్థి



విద్యార్థి మధుచరణ్ గౌడ్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీఈఏపీ సెట్-25 ఆన్‌లైన్ బేస్డ్ ప్రవేశ పరీక్షలో గందరగోళం నెలకొంది. రెండేళ్లు కష్టపడి చదివిన ఇంటర్మీడియట్ విద్యార్థి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఏపీఈఏపీ సెట్ కాకినాడ జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. పరీక్ష హాల్ టికెట్ జారీనుంచి పరీక్ష నిర్వహణ దాకా గందరగోళంగా నెలకొనడంతో విద్యార్థులు నష్టపోవాల్సి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా షాబాద్ గ్రామానికి చెందిన పరమేశ్వరగౌడు కుమారుడు మధుచరణ్ గౌడు ఇంటర్‌లో బైపీసీ గ్రూపు అభ్యసించారు. ఏపీఈఏపీ సెట్ పరీక్షకు అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం కర్నూలు డా.కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మధుచరణ్ పరీక్ష రాసేందుకు వెళ్లాడు. ఈ విద్యార్థికి బైపీసీ స్ట్రీమ్ అగ్రికల్చర్, ఫార్మసి కోర్సు కు సంబంధించి క్వశ్చన్ పేపర్ కాకుండా ఎంపీసీ స్ట్రీమ్ (ఇంజనీరింగ్) కోర్సుకు సంబంధించిన ప్రశ్నాపత్రం ఇవ్వడంతో విస్తుపోయారు. ఇంజనీరింగ్ కోర్సు సంబంధించిన ప్రశ్నాపత్రమని పరీక్ష నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లాడు. అయితే తాము ఏమీ చేయలేమని, ఇచ్చిన పేపరునే రాయాలని సూచించారు. లేదంటే కాకినాడ జేఎన్‌టీయూ కన్వీనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని పరీక్షల నిర్వాహకులు సూచించారు. దీంతో ఒక పేపరు బదులు మరో పేపరు రావడంతో తనకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంతో కష్టపడి చదివి పరీక్ష రాసేందుకు వస్తే తనకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని ప్రభుత్వానికి, సెట్ కన్వీనర్‌కు బాధిత విద్యార్థి వేడుకుంటున్నాడు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు 1,217 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ బుధవారం జరిగిన పరీక్షలో మొత్తం 1,217 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ తెలిపారు. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 5,098 మంది నమోదు చేసుకోగా 3,053 మంది పరీక్షకు హాజరు కాగా, 1,145 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షకు 192 విద్యార్థులు నమోదు చేసుకోగా, 172 మంది పరీక్షకు హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు 512 మందికి గానూ 460 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ 5 పరీక్షా కేంద్రాలను, సహాయ కమిషనర్ 5, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 28 పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించారు.

నేడు భారీ వర్షాలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో నేడు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో చెదురుమదురు వర్షాలతో పాటు అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వ హణ సంస్థ ప్రకటించింది. భారీ వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నందున హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న గోడలు, చెట్ల కింద నిలబడకూడదన్నారు. పిడుగులతో కూడిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మార్గదర్శకులు

- మేమున్నామంటున్న పొదుపు లక్ష్మి మండల ఐక్య సంఘం
- ఐదు 'మార్గదర్శి బంగారు కుటుంబాల' దత్తత

6లో



ఆసనాలు వేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ నవ్య తదితరులు

యోగా జీవితంలో భాగం కావాలి

- వీటితో కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ పి. రంజిత్ బాషా
- యోగాతో చురుకుదనం : మేయర్ బీవై రామయ్య
- మే 21 నుంచి జూన్ 21వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ : జేసీ నవ్య
- ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర కర్టెన్‌రైజర్ ప్రారంభం





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్, కలెక్టర్, ఎస్పీ, జేసీ

కర్నూలు కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగా అందరి జీవితాల్లో ఒక భాగం కావాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర క్యాంపెయిన్‌కు శ్రీకారం చుడుతూ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు (యోగా గురువులు) వివిధ రకాల ఆసనాలు వేయించారు. కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ డాక్టర్ బి. నవ్య, ఇతర అధికారులు యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై ఈరోజు నుంచి నెలరోజుల పాటు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. నెల రోజుల పాటు వివిధ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ఆరోగ్య భారతావని ఉండాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి యోగా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషదాయకమన్నారు. యోగాతో ఆరోగ్యంతో పాటు చదువులో, ఆటల్లో అన్నింటిలో చురుకుగా ఉంటారన్నారు. జేసీ డాక్టర్ బి. నవ్య మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాలను ప్రకటించారని, ఈ నెలంతా జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. యోగా కార్యక్రమాల్లో పాల్గొనే వారు యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. యోగా వల్ల మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుందని జేసీ పేర్కొన్నారు. యోగా ఆసనాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని టౌన్ మోడల్ హైస్కూల్‌లో యోగా ఉత్సవాలకు సంబంధించిన భారీ బెలూన్‌ను కలెక్టర్, ఎస్పీ, జేసీ ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగరపాలక కమిషనర్ ఎస్ రవీంద్రబాబు, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎంహెచ్‌వో శాంతికళ, ఆయూష్ శాఖ వైద్యులు డాక్టర్ ప్రసాద్, యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అవినాష్, యోగా శిక్షకులు మునిస్వామి, విజయకుమార్, డాక్టర్ ముంతాజ్‌బేగం, గౌరి, జిల్లా అధికారులు, అభ్యాసకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నల్లమలలో జీవ వైవిధ్యం



- ప్రపంచీకరణతో వెంటాడుతున్న ముప్పు
- అంతరించిపోయిన పలు జీవులు
- నేడు అంతర్జాతీయ జీవవైవిధ్య దినం

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): నల్లమల జీవ వైవిధ్యానికి మారుపేరు. నల్లమల జీవవైవిధ్య సమతౌల్యాన్ని సజావుగా సాగిస్తూ జీవుల మనుగడకు తోడ్పాటునందిస్తోంది. ప్రత్యేకించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిబింబంగా నిలిచే పెద్దపులుల ఆవాసానికి కీలకమైన నల్లమల అడవులు ప్రకృతి నిధులుగా, సహజ సంపదలుగా వేల సంవత్సరాల నుంచి ఎంతో విశిష్టతను సంతరించుకున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన నల్లమలలో ప్రస్తుతం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రపంచీకరణ వల్ల జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది. పలు జీవుల ఉనికే కనుమరుగైపోయింది. ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యం దెబ్బతింటున్న సందర్భంలో ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి సకల జీవుల సంరక్షణకు తోడ్పాటు నందించాలన్న సంకల్పంతోనే ప్రతిఏటా మే 22వ తేదిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి పిలుపు ఇచ్చింది.



నల్లమలలో సుమారు 1500 రకాల వృక్షజాతులు, 200 రకాల పక్షిజాతులు, 80రకాల గడ్డిజాతులు, 350 రకాల ఔషదమొక్కలు, 55 రకాల మత్స్యసంపద, 80రకాల సరీసృపాలు, 20 రకాల ఉభయ చరజీవులకు నల్లమల అడవులు ఆవాసాన్ని కల్పిస్తున్నాయి.

ప్రత్యేకించి పర్యావరణ సూచికలో త్రికోణ అగ్రభాగాన నిలిచిన పెద్ద పులి ఆవాసానికి సైతం నల్లమల అనుకూలంగా వుంది. ఎంతో సున్నితమైన జీవనం సాగించే పులుల ఎక్కడైతే ఆవాసాన్ని ఏర్పర్చుకుంటాయో ఆ ప్రాంతం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయని చెప్పవచ్చు. వాస్తవానికి జాతీయ అటవీ విధానం ప్రకారం భూవిస్తీర్ణంలో 33శాతం అడవులు ఉండాల్సి వుండగా ప్రపంచవ్యాప్తంగా 31శాతం అటవీ విస్తీర్ణం వుండగా మన దేశంలో మాత్రం కేవలం 23శాతం మాత్రమే అడవులు విస్తరించి ఉన్నాయి. అయితే మన ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాత్రం 21శాతం మాత్రమే అడవుల విస్తీర్ణం వున్నట్లు తెలుస్తోంది. అంటే జిల్లా వ్యాప్తంగా 17,658 చ.కి.మీల విస్తీర్ణం వుండగా అందులో 3482.65చ.కిమీల విస్తీర్ణంలో మాత్రమే అడవులు విస్తరించాయి.

ఈ పరిస్థితి వల్ల నల్లమలలో అనేక జీవ జాతులు అంతరించి పోతున్నాయి. ప్రత్యేకించి రాబందుల సంచారం నల్లమలలో కనుమరుగైంది. అలాగే పిచ్చుక జాతులు ఉనికే లేకుండా పోయింది నల్లమలలో ఒకప్పుడు విస్తారంగా ఉండే జిట్రేగి, బంక చెట్లు నేడు కనుమరుగయ్యాయి. పలు నీటి కుంటలు, సరస్సుల్లో గుర్రపుడెక్క అల్లుకుపోవడం వల్ల జలచరాల జీవనానికి ఇబ్బందిగా మారుతున్నట్లు తెలుస్తోంది.

సుస్థిరమైన అభివృద్ధి కోసం అటవీశాఖ కసరత్తు :

సుస్థిరమైన జీవ వైవిధ్యాన్ని అభివృద్ధి పరిచేందుకు అటవీశాఖ ఎంతగానే కసరత్తు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకించి జీవవైవిధ్య సంరక్షణలో భాగంగా జీవజాతులకు అవసరమయ్యే ఆహారం, ఆవాసం, తాగునీటిని సమకూర్చేందుకు అటవీశాఖ చొరవ తీసుకుంటున్నది. వీటితో పాటు అడవుల పరిరక్షణ, అభివృద్ధి, రక్షణ అనే అంశాలను పరిగణలోకి తీసుకుని అటవీశాఖ ముందుకెళ్తోంది. ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల పరిధిలో వున్న నల్లమల అడవుల్లో 3727.82 చ.కిమీలో నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం విస్తరించింది. ఇందులో పెద్దపులి ఆవాసానికి అనువైన ప్రాంతమైన కోర్‌ఏరియా 1250.46 చకిమీలు కాగా, గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యంలోని కోర్- ప్రాంతం 1193.68 చకిమీలు ఉంది.

జీవవైవిధ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి



అడవుల సంరక్షణలో ప్రజలు భాగమైనప్పుడే జీవవైవిధ్యాన్ని పరిరక్షించే అవకాశం వుంటుంది. జీవవైవిధ్య సంరక్షణకై అటవీశాఖ అనేక విధాలుగా కృషి చేస్తున్నది. దీనికి అనేక ప్రచార సాధనాల ద్వారా చర్యలు తీసుకుంటున్నది.

- సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

జీవవైవిధ్య సంరక్షణలో ఆదివాసుల పాత్ర

వందల ఏళ్ల నుంచే అడవి తల్లికి ఆదివాసులే అండగా నిలుస్తున్నారు. అటవీశాఖ ఆవిర్భావానికి మునుపే అటవీరక్షణలో చెంచులు రాణిస్తున్నారు. వృక్షసందపను కొల్లకొట్టే స్మగ్లర్లను, వన్యప్రాణులను వేటాడే వేటగాళ్లపై అనేక సందర్భాల్లో ఎదిరించి అటవీ రక్షణలో భాగస్వాములై జీవవైవిధ్య సంరక్షణకు పాటుపడుతున్నారు. అయితే ప్రస్తుతం అటవీరక్షణలో చెంచులకు అటవీ శాఖ సరైన ప్రాముఖ్యత కల్పించడం లేదు.

పుష్కరిణికి రూ.2.80 కోట్ల విరాళం

- స్థపతితో నిర్మాణ పనుల పరిశీలన
- త్వరలో అందుబాటులోకి పుష్కరిణి



మంత్రాలయంలో కొనసాగతున్న పుష్కరిణి పనులు

మంత్రాలయం, మే 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటక లోని ఉడిపి చెందిన ప్రకాష్ శెట్టి అనే భక్తుడు రూ.2.80 కోట్లు పుష్కరిణి పనులకు విరాళంగా ఇచ్చారు. బృందావన్ గార్డెన్, సర్వజ్ఞ మందిరం స్థలంలో పుష్కరిణి పనులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. 160 అడుగుల పొడవు, 70 అడుగుల వెడల్పు, 7.5 అడుగుల లోతుతో పుష్కరిణి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు సురేష్ కోనపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి, స్థపతి తిరుమల స్తంభి, ప్రముఖ చిత్రకారుడు నటరాజన్ గణేష్ తో పుష్కరిణి పనులు పరిశీలించారు. త్వరలో పుష్కరిణి పనులు పూర్తి చేసి తుంగభద్ర నది నుంచి పుష్కరిణిలో నీటిని నింపి భక్తులకు అందు బాటులోకి తీసుకురానున్నారు. పూజలు చేసేందుకు అనుకూలంగా మెట్లు, రూపకల్పన, సరిహద్దులు, ప్రహరీ కంచను ఏర్పాట చేయాలని పీఠాధి పతి అధికారులను ఆదేశించారు. ఈ పుష్కరిణి నిర్మాణానికి విరాళం ఇచ్చి న దాత ప్రకాష్‌శెట్టిని పీఠాధిపతి అభినందించారు. కార్యక్రమంలో మఠం ఏఈ బద్రినాథ్, శ్రీహరి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, ద్వారపాలక అనంతస్వామి, శ్రీహరి కాంట్రక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ హనుమంతు పాల్గొన్నారు.

ప్రతి వారం మండలాలకు వెళ్లండి

- ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించాలి
- 16 ప్రభుత్వ అంశాల మీద ప్రజాభిప్రాయం సేకరించాలి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారులు ప్రతి వారం మండలాలకు వెళ్లాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించాలన్నారు. గత రెండు నెలల్లో ఎన్ని రోజులు మండలాలకు వెళ్లారు? తాగునీటి సమస్య ఉందా? పారిశుధ్యం ఎలా ఉంది? ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయన్న అన్న అంశాలపై ఆరా తీశారు. ఎక్కడైనా సమస్యలు గుర్తించారా అని మండల స్పెషల్ అధికారులను ప్రశ్నిం చారు. ప్రతినెలా 16 ప్రభుత్వ అంశాల అమలు మీద ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతోందని, ప్రజాభిప్రాయం వ్యతిరేకత వ్యక్త మైతే వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ అధికా రులను ఆదేశించారు.

పెంఛన్ పంపిణీకి హాజరు కావాలి

ప్రతి నెలా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి వారం మండల స్పెషల్ అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ జడ్పీ సీఈవోను ఆదేశించారు. మండల స్పెషల్ అధికారిగా ఉన్నప్పటికీ రెండు నెలల నుంచి తనకు కేటా యిం చిన నందవరం మండలానికి వెళ్లి మండల పురోగతిపై సమీక్ష నిర్వహించలేదని నందవరం మండల స్పెషల్ అధికారి, పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎంను సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, కర్నూలు నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు, వీసీ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ పాల్గొన్నారు.





కర్నూలు నగరంలోని హంద్రీనదిలో ప్రవహిస్తున్న వరద నీరు



సుంకేసుల బ్యారేజీని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి

సుంకేసులకు వరద

- ఎన్నో ఏళ్ల తర్వాత మే నెలలో తుంగభద్రకు వరద
- హంద్రీలో వరద ప్రవాహం
- జిల్లాలో విస్తారంగా వర్షాలు

కర్నూలు, మే 21 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాలు ముందుగానే పలకరించాయి. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కర్ణాటకలో సైతం భారీవర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు ఉపనది అయిన వేదవతి పొంగిపొర్లుతుంది. ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పోటెత్తింది. బుధవారం కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), జలవనరుల శాఖ గేజింగ్ రికార్డుల ప్రకారం కోసిగి మండలం మేలగనూరు వద్ద తుంగభద్రలో 20వేల క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. మంత్రాలయం వద్ద 20,140 క్యూసెక్కుల వరద ప్రవహిస్తుంది. సుంకేసుల బ్యారేజీకి 17,916 క్యూసెక్కులు వరద ఉంది. దాదాపు పదేళ్ల తర్వాత మే నెలలో తుంగభద్రకు వరద రావడం ఇదే ప్రథమం. జిల్లాలో ప్రవహించే హంద్రీ నదికి వరద చేరడంతో కర్నూలు నగరం రాజ్‌విహార్‌లో వరద నీటి ప్రవాహం తో నగర వాసులను కనువిందు చేస్తుంది. దాదాపు పదేళ్ల తర్వాత హంద్రీకి మే నెలలో వరద రావడం ప్రథమమని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. సుంకేసుల బ్యారేజీని ఇరిగేషన్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే సుంకేసుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.



ఓ... మేఘమాల

ప్రకృతి పారవశ్యానికే కాదు... పద బంధాల అల్లికలోనూ, భూమి, ఆకాశాల అందాలలోనూ పెనవేసుకుంటాయి. నింగీ నేలా కలిసిపోయినట్లు అనిపించేలా ఉన్న నీలి మేఘమాల అద్భుత దృశ్యం కర్నూలు నగర శివారులోని జగన్నాథ గుట్టపై బుధవారం సాయంత్రం కనిపించింది. ఆకాశంలో కారు మబ్బులు సమూహాలై దట్టంగా చేరి కర్నూలును చుట్టుముట్టేశాయా? అన్నట్లు కనిపిస్తున్న ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- కర్నూలు(ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కర్నూలు



మార్గదర్శకులు

ఓర్వకల్లు, మే 21 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి బంగారు కుటుంబానికి ఓర్వకల్లు పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం బాటలు వేసింది. పొదుపులక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఐదు మార్గదర్శి బంగారు కుటుంబాల దత్తత తీసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలన కోసం 'మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంపన్న కుటుంబాలు అనగారిన వారికి మధ్య ప్రత్యక్ష సం బంధాన్ని సృష్టించడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సేవా మనస్తత్వంతో ఉన్న సంపన్న కుటుంబాలు పేద కుటుంబాలను దత్తత తీసుకోవడమే ప్రధాన లక్ష్యం.

- మేమున్నామంటున్న పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం
- ఐదు 'మార్గదర్శి బంగారు కుటుంబాల' దత్తత
- పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి
- పొదుపు మహిళల స్ఫూర్తి ప్రశంసనీయం

నన్నూరు మాబున్నీ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న విజయభారతి



ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి..

'మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమంలో తమ సహకారం అందించేందుకు ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం ముందుకొచ్చింది. ఆ సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. నన్నూరు గ్రామానికి చెందిన మౌలాబీకి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు 17ఏళ్ల వయసులో ఫిట్స్‌రోగానికి చనిపోయాడు. భర్త గుండె బ్యాధితో, కుమార్తె ఫిట్స్‌తో బాధపడుతుంది. ఆమెకు నెలకు రూ.2వేలు వరకు మందులు ఖర్చు అవుతాయని, వాటిని కొనే స్థోమత లేదని కమిటీ సభ్యులకు వివరించారు. ఆ కుటుంబానికి మండల ఐక్యసంఘం నెలకు రూ.2వేల చొప్పున జీవితాంతం మందుల ఖర్చు భరిస్తామని, రూ.24వేల చెక్కును అందజేశారు.



మార్గదర్శి బంగారు కుటుంబ సభ్యులతో విజయభారతి

బాలభారతి స్కూల్‌లో ఆయా పోస్టు

హుశేనాపురం గ్రామానికి చెందిన నుసుదుబి భర్తకు క్యాన్సర్ రాగా నలుగురు పిల్లలతో రోడ్డున పడ్డారు. గుర్తించిన మండల సమాఖ్య దత్తత తీసుకుని ఇద్దరు పిల్లలకు పదోతరగతి వరకు ఉచితంగా విద్య అంది స్తామని, ఆమెకు బాలభారతి స్కూల్‌లో ఆయా పోస్టు కల్పించారు.

చదివించే బాధ్యత..

ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన చెట్లమల్లాపురం లక్ష్మీదేవి కొడుకు హత్యకు గురికాగా, కోడలు జైలులో ఉంది. తల్లిదండ్రులు లేక ముగ్గురు పిల్లలు అనాథలు మారి నాయనమ్మ వద్ద ఉంటున్నారు. వారికి రూ.50 వేల చెక్కును అందజేశారు. అలాగే చదివించే బాధ్యతను తీసుకున్నారు.

వైద్యం ఖర్చుల కోసం నెలకు రూ.3వేలు

హుశేనాపురం చెందిన భాగ్యలక్ష్మి భర్త అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. భాగ్యలక్ష్మి కూడా అనారోగ్యం బారిన పడింది. వైద్యం చేయించుకోవడానికి, పిల్లలను చదివించేందుకు ఇబ్బందులు పడుతుండేది. మండల సమాఖ్య ఇద్దరు పిల్లలకు ఇంజనీరింగ్ పూర్తయ్యేదాకా చదివిస్తామని, ఆమెకు నెలకు రూ.3వేలు వైద్యం కోసం ఇస్తామని చెక్కును అందజేశారు. అలాగే చింతలపల్లె గ్రామానికి చెందిన వృద్ధురాలి భర్త, కొడుకు చనిపోవడంతో ఆమె అనా రోగ్యంతో బాధపడుతూ తిండిలేని స్థితిలో ఉంది. ఆమెకు మందుల ఖర్చులు అందజేస్తామన్నారు. పొదుపులక్ష్మి మహిళల స్ఫూర్తి ప్రశంసనీయమని బంగారు కుటుంబ సభ్యులు కొనియాడారు.

రుణపడి ఉంటా..



నా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ముందుకు వచ్చిన పొదుపులక్ష్మి సంఘానికి రుణపడి ఉంటా. రోడ్డున పడిన మా కుటుం బాన్ని ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

నుసుదుబి, హుశేనాపురం

నా జీవితానికి భరోసా



నా జీవితానికి మండల సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో మార్గదర్శి బంగారు కుటుంబం ప్రవేశ పెట్టడం పేదల జీవితాల్లో వెలుగు నింపడమే.

మౌలాబీ, నన్నూరు

సీఎం చంద్రబాబే మాకు స్ఫూర్తి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే మాకు స్ఫూర్తి. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అత్యంత ఐదు నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని వారిలో చీకటి నుంచి బయటకు తీసుకురావాలని ముం దుకు వెళ్తున్నాం. రాబోయే సంవత్సరంలో 1000 మంది కుటుంబాలను దత్తత తీసుకోవాలని లక్ష్యం పెట్టుకున్నాం.

- విజయభారతి, పొదుపు లక్ష్మి మండల సమాఖ్య గౌరవసలహాదారు

కర్నూలు 7వ అదనపు జిల్లా న్యాయాధికారిగా లక్ష్మీరాజ్యం

కర్నూలు లీగల్, మే 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణ జిల్లా నందిగామలో సీనియర్ సివిల్ న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మీరాజ్యంను కర్నూలు 7వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారిగా పదోన్నతి కల్పించి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమె కర్నూలు మహిళా కోర్టు న్యాయాధికారిగా, వక్ఫ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది. ఇంత వరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న జి.భూపాల్ రెడ్డి గత నెలలో బదిలీ కావడంతో ఏర్పడిన ఖాళీని రాష్ట్ర ప్రభుత్వం ఈమె నియామకంతో పూర్తి చేసింది. ఈమె బాధ్యతలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఉఆదేశాలలో పేర్కొంది.

డిగ్రీ సెమిస్టర్‌లో ఐదుగురి డిబార్

కర్నూలు అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 26 పరీక్షా కేంద్రాల్లో 7,498 మంది దరఖాస్తు చేసుకోగా 6,769 మంది హాజరయి పరీక్షలు రాశారని తెలిపారు. రాఘవేంద్ర డిగ్రీ కాలేజీ, ఎమ్మిగనూరు-1, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోసిగి-2, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజీ, కర్నూలు-1, శ్రీసాయి డిగ్రీ కాలేజీ, డోన్-1 విద్యార్థులు పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేశామని ఆయన తెలిపారు.

దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

ఎమ్మిగనూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణం, పరిసర ప్రాంతాలలో బైకుల చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. 16 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ శ్రీనివాసులు వివరాలు తెలిపారు. 16 బైకుల దొంగతనంలో ఉప్పరి వీరేష్, వర్ధన్, అబ్దుల్ కలాం నిందితులని తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణ శివార్లలో గల ఉప్పర కొట్టాల కాలనీ దగ్గర మంత్రాలయం రోడ్డులో దాగి ఉన్న నిందితుడు ఉప్పరి వీరేష్ (26)ను బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేసి విచారించినట్లు తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో చోరీ చేసిన బైకులను రికవరీ చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు అబ్దుల్ కలాం గతంలో నమోదైన మరో కేసులో ప్రస్తుతం జైలులో ఉన్నట్లు తెలిపారు. మరో నిందితుడు ఇక్బాల్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. 16 బైకుల మొత్తం విలువ రూ 15,60,000 అని తెలిపారు. ఆరెస్టు అయిన వీరేష్‌ని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై మధుసూదన్ రావు ఉన్నారు.



బైకులు, నిందితుతో పోలీసులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి, బైక్‌పై నుంచి పడి మహిళ..

కర్నూలు క్రైం/ బనగానపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో నందికొట్కూరు రహదారిలో భూపాల్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పింజారి సిద్దయ్య(59) అనే వ్యక్తి మృతిచెందాడు. నందికొట్కూరుకు చెందిన పింజారి సిద్దయ్య తన మిత్రుడు సయ్యద్‌తో కలిసి మోటారు సైకిల్‌పై కర్నూలు బయల్దేరాడు. వీరిద్దరూ వృత్తి రీత్యా లారీ డ్రైవర్లు. ఆత్మకూరు చెందిన ఆర్టీసీ డిపో బస్సు ఆత్మకూరు వైపు వెళ్తూ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో సిద్దయ్య కాలు తెగి పక్కనపడింది. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా కోలు కోలేక కొద్దిసేపటికే మరణించాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బనగానపల్లె మండలం పలుకూరుకి చెందిన బోయ మహాలక్ష్మి(20) రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందింది. పలుకూరు నుంచి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బైకు నుంచి జారి కిందపడింది. తలకు తీవ్రమైన గాయం కావటంతో మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన టిప్పర్

మద్దికెర, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామ శివారు వద్ద హంద్రీనీవా కాలువలోకి టిప్పర్ దూసుకెళ్లింది. వివరాల మేరకు.. డ్రైవర్ పత్తికొండ నుంచి వస్తూ పనులు చేస్తున్నాడు. బుధవారం వస్తుండగా మట్టి వదులుగా ఉండటంతో టిప్పర్ అదుపు తప్పింది. డ్రైవర్ రాముడుకు గాయాలై కాలు విరిగింది. అతడిని 108లో గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు.



కాలువలో పడిన టిప్పర్

మంత్రాలయంలో పది లారీలు సీజ్

మంత్రాలయం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం స్టీల్ ఫ్యాక్టరీకి వస్తున్న రికార్డులు లేని లారీలను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చి వెళ్లే లారీలను, రికార్డులు, ఇతరత్రా వస్తువులు సరఫరా అవుతున్నాయన్న సమాచారంతో పోలీసులు లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలను రోడ్డుపైనే సీజ్ చేశారు. రికార్డులు సక్రమంగా కలిగిన ఉన్న వాహనాలను వదిలేశారు. మరికొన్నింటికి అపరాధ రుసుం విధించారు. అదేవిధంగా పరిమితికి మించి లోడుతో వెళ్తున్న వాహనాలను కూడా పోలీసులు పరిశీలించారు. ఆదోని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సైతం దాడులు చేసి రెండు లారీలు మాధవరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. రోజు వందలాది లారీలు రికార్డులు, పర్మిట్లు లేకుండానే రాకపోకలు సాగిస్తున్నాయని ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో దాడులు నిర్వహించి పది లారీలు సీజ్ చేసినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

సీఐపై దాడి కేసులో నిందితులకు జైలు

కర్నూలు లీగల్, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారుపేటలో ప్రభుత్వ భూమి కబ్జాలను తొలగించేటప్పుడు బందోబస్తు విధులు నిర్వహిస్తున్న అప్పటి సీఐ పార్థసారధి రెడ్డిపై దాడి చేసి గాయపరిచిన ఏడుగురు నిందితులకు ఒక్కొక్కరికి 5 సంవత్సరాల కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు సెషన్స్ జడ్జి దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. స్థానిక రెండో పట్టణ పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీటు మేరకు 2021 నవంబరు 30న బంగారు పేటలోని కేసీ కెనాల్‌కు ఆనుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కట్టడాలను తొలగించడానికి బందోబస్తుగా అప్పటి టూ టౌన్ సీఐ పార్థసారధి రెడ్డి, అప్పటి కోడుమూరు సీఐ శ్రీధర్ సిబ్బందితో అక్కడకు వెళ్లారు. అయితే.. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తుండగా.. కొంత మంది రాళ్లతో పోలీసులపై దాడి చేయడంతో సీఐ పార్థసారథిరెడ్డికి గాయలయ్యాయి. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు స్థానిక బంగారు పేటకు చెందిన డి.లక్ష్మి, నీలిశికారి బెల్కి, ఎన్. నరసింహులు, నీలిశికారి సుగుణ, ప్రసాద్, నీలిశికారి నాగముని, నీలిశికారి బెహినిలపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడుగురు నిందితులకు ఐదు సంవత్సరాల కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున బాల రంగస్వామి వాదించారు.

లాభాలపాలు



చెట్టు నుంచి పాలను సేకరిస్తున్న కూలీ

- కేజీ పాలు రూ.60 నుంచి రూ.200
- ఔషధ తయారీల్లో వినియోగం
- బొప్పాయి పాలతో రైతులకు ఊరట
- ఉత్తర భారతదేశంలో బొప్పాయి కాయలకు తగ్గిన గిరాకీ
- పాల సేకరణ వైపు మొగ్గు
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యాపారులు



బొప్పాయి పాలు



చిన్నవంగలిలో సాగు చేసిన బొప్పాయి తోట

చాగలమర్రి, మే 21 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి పాలు రైతులకు, వ్యాపారులకు లాభాల బాట పట్టిస్తున్నాయి. ఈపాలకు యమ డిమాండ్ ఉంది. బొప్పాయి పంటలో వైరస్ ఎక్కువ. సీజనల్ ఇబ్బందుల వల్ల పంట దిగుబడిలో అంచనాలు తారుమారు అవుతాయి. ఒక్కోసారి బొప్పాయి కాయల ధర, డిమాండ్ స్థిరంగా ఉండదు. బొప్పాయి పాలకు పెరుగుతున్న ప్రాధాన్యత వల్ల రైతులు ఊరట చెందుతున్నారు.

పాల సేకరణ ఇలా..

బొప్పాయి పాల సేకరణకు మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రంలోని కొయ్యంబత్తూరు, కడప జిల్లాలోని రైల్వేకోడూరుకు చెందిన కొందరు వ్యాపారులు చిన్నవంగలి గ్రామాన్ని సందర్శించి వైరస్ సోకి పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి పంటను ఎకరాకు రూ.6 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పంటకు రూ.10వేలు చెల్లించి పాలను సేకరిస్తున్నారు. కేజీ పాలను రూ.60నుంచి రూ.200 వరకు కొంటున్నారు. ఈపాలను ఔషధాల తయారీలో వినియోగిస్తున్నారని వారు చెబుతున్నారు. బొప్పాయి కాయలకు బ్లేడ్‌తో మూడు చోట్ల గాట్లు వేస్తారు. పాలు కారే సమయంలో చెట్ల కింద ప్లాస్టిక్ ప్లేట్లు ఏర్పాటు చేస్తారు. ఇలా సేకరించిన పాలు ముద్దగా మారిపోతాయి. వాటిపై నీళ్లు చల్లి ప్లేట్లలో ఉన్న పాలను డ్రమ్ముల్లోకి మార్చి ఎగుమతి చేస్తారు. పాలు కారాక బొప్పాయి కాయలు పనికి రాకుండా పోతాయి. రైతులు బొప్పాయి చెట్లను తొలగిస్తారు. దెబ్బతిన్న బొప్పాయి తోటల్లో పాల సేకరణతో రైతులకు ఉపశమనం కలుగుతుంది.

రోజుకు 50 నుంచి 70 కేజీల..

బొప్పాయి పండ్లు ఎగుమతి చేసే ఏజెంట్ సురేష్ మాట్లాడుతూ బొప్పాయి పాలకు గిరాకీ ఉండటంతో తోటలను కొనుగోలు చేసి పాలు సేకరిస్తున్నామన్నారు. 10 మంది కూలీ లు రోజుకు 50 నుంచి 70 కేజీల బొప్పాయి పాలను సేకరిస్తారు. కూలీల కు రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు కూలీ ఇస్తున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఎకరా బొప్పాయి పంట నుంచి 75 కేజీల పాలు, పూర్తిగా దెబ్బతిన్న పంట నుంచి 50 కేజీల పాలు వస్తాయి.

ఆదుకుంటున్న పాల సేకరణ

బొప్పాయి పండ్లు, పాలు పలురకాల వ్యాధులకు ఔషధంగా పని చేస్తాయని వైద్యులు చెబుతారు. డెంగీ, ఇతర వ్యాధుల బారిన పడిన వారు బొప్పాయి పండు విరివిగా తినాలని సూచిస్తున్నారు. బొప్పాయి ఆకు రసం కూడా సేవించవచ్చని కొందరు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం బొప్పాయికి వైరస్ సోకడంతో దిగుబడి తగ్గింది. ఉత్తర భారతదేశంలో గిరాకీ అనుకున్నంత లేకపోవడంతో ఎగుమతులు తగ్గాయి. దీంతో టన్ను ధర రూ.20వేలు నుంచి రూ.5వేలకు పడిపోయింది. ఈ పరిస్థితుల్లో బొప్పాయి పాల సేకరణ రైతులను ఆదుకుంటోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో బొప్పాయి సాగు చేసి నష్టపోయిన రైతులకు బొప్పాయి పాల సేకరణతో కొంత ఊరట కలుగుతోంది.



బొప్పాయి పాలు సేకరిస్తున్నాం

ప్రతి రోజు ఒక ఎకర పంటలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 కేజీల పాలను సేకరిస్తాం. కేజీ పాలకు రూ.20 ఇస్తున్నారు. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. బొప్పాయి పాల సేకరణ ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి జీవిస్తున్నాం.

- రాశి, మహిళా కూలీ, రైల్వే కోడూరు

బొప్పాయి పాలతో ఊరట..

ప్రకృతి వైపరీత్యాలతో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది. గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నాం. పాల సేకరణకు తోటలు అమ్ముకుంటాం. బొప్పాయి పాల సేకరణతో కొంత ఊరట కలుగుతోంది.

- గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి గ్రామం



గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- హౌసింగ్ పీడీ చిరంజీవి



మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి

తుగ్గలి, మే 21 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు.

బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణం కోసం దరఖాస్తులను తనిఖీ చేసి, అర్హులైన లబ్ధిదారుల గృహాలను మాత్రమే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ సచివాలయ పరిధిలో దరఖాస్తులను పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటేనే ఆన్‌లైన్ చేసి బిల్లులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విశ్వమోహన్, హౌసింగ్ డీఈ విజయ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరానికి తరలిరండి: బొజ్జా



సంతజూటూరులో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

బండిఆత్మకూరు మే21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతాంగం జీవనాడి సిద్ధేశ్వరం అలుగు సాధనకై ఈ నెల 31వ తేదీన చేపట్టిన చలో సిద్ధేశ్వరం కార్యక్రమానికి రైతులంతా తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సంతజూటూరు గ్రామంలో రైతులతో ఆయన మాట్లాడుతూ గత పాలకులంతా రాయలసీమకు తీరని అన్యాయం చేశారన్నారు. రాయలసీమకు సాగునీరు అందించలేని పాలకులు వివిధ ప్రాజెక్టు నిర్మాణాలు బూచిగా చూపి దగా చేస్తున్నారని అన్నారు. రాయలసీమ రైతుల గొంతుక అసెంబ్లీకి వినిపించాలని, ప్రభుత్వం సిద్ధేశ్వరం నిర్మించేలా చలో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. నాగసుధాకర్, పక్కీర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడటం అందరి విధి

- విజిబుల్ పోలీసింగ్‌లో 94 మందిపై కేసు నమోదు : ఎస్పీ

నంద్యాల టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం జిల్లాలో విబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా 94 మద్యం తాగిన కేసులు నమోదు చేశామని, 95 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుక, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణ, జరగ కుండా ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్కా, జూదం జిల్లాలో ఎక్కడ జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు.



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

అవినీతి అధికారుల్లో దడ



- మరిన్ని శాఖలపై ఏసీబీ నిఘా
- 'రెవెన్యూ'లో పైసలిస్తే పనులు అనే ఆరోపణ
- పోలీసు శాఖలోనూ ఇదే తంతు..
- ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న చైతన్యం
- లంచం అడిగితే ఫిర్యాదు
- మార్పుతోనే అవినీతి అంతం: సోమన్న, డీఎస్పీ, ఏసీబీ

ఆళ్లగడ్డ, మే 21 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారుల్లో దడ మొదలైంది. మరిన్ని శాఖలపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారు. ఇటీవలే పట్టణంలో విద్యుత్ శాఖ ఏడీఈ రవికాంత్ చౌదరి ఏసీబీ అధికారులకు చిక్కారు. అతడి వద్ద ఉన్న కేజీల కొద్ది బంగారు ఆభరణాలు, స్థిర, చరాస్తులపై దాడులు కొనసాగి స్తున్నారు. కింది స్థాయి అధికారుల వద్ద పనులు కాకపోతే ప్రజలు ఉన్నత స్థాయి అధికారుల వద్దకు తమ సమస్యలు విన్నవించేందుకు వస్తున్నారు. వారు కూడా లంచాలు అడుగుతుండటంతో చేసేదీ లేక ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రజల్లో కూడా చాలా మార్పు వచ్చింది. ఎవరు లంచం అడిగినా వెంటనే ఏసీబీకి సమాచారం ఇస్తున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పంచాయతీ రాజ్ శాఖలపై కూడా ఏసీబీ అధికారులు నిఘా వేసినట్లు ప్రచారం కొనసాగుతోంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పైసలిస్తే తప్ప పనులు జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు శాఖలో కూడా అక్కడ క్కడ కొంతమంది లంచావతారులు ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఆళ్లగడ్డ ఎస్ఐ హరిప్రసాద్ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ వద్ద రూ 20 వేలు లంచం డిమాండ్ చేయడంతో ట్రాక్టర్ డ్రైవర్ రూ.10 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఇంకా పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేయ గా ట్రాక్టర్ డ్రైవర్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అవినీతి అధికారులు ఇటీవల కాలంలో దాడులు ముమ్మరం చేయడంతో పాటు ఉన్నతాధికారులను సైతం కటకటాలపాలు చేస్తుండడంతో ప్రజలకు కొండంత ధైర్యం వస్తుంది.

విద్యుత్ శాఖలోనే

ఆళ్లగడ్డ మండలం చిన్న కంబలూరులో విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి, సిబ్బంది ప్రతాప్ రూ.40 వేలు లంచం తీసు కుంటూ ఇటీవలే పట్టుబడ్డారు. విద్యుత్ శాఖలోనే మరికొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీరు సంపాదిం చుకుంది చాలని అతిగా వ్యవహరిస్తే ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని మెల్లగా ఆయా కార్యాలయాల నుంచి ఇతర ప్రాంతాలకు జారుకొన్నట్లు సమాచారం.

ఎక్కడ అవినీతి జరిగినా ఫిర్యాదు చేయండి



అవినీతి ఎక్కడ జరిగినా ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. ప్రజల్లో మార్పు వస్తే అవినీతి కూడా అంతరించిపోతుంది.

- సోమన్న, డీఎస్పీ, ఏసీబీ

కర్మాగారాల్లో భద్రత తప్పనిసరి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్మాగారాల్లో భద్రతకు అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కర్మా గారాల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఫ్యాక్టరీస్ శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కర్మాగారాల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమణాల మేరకు ఖచ్చితంగా భద్రతా చర్యలు తీసుకోవాలని కర్మాగారాల యజమాన్యాల ప్రతినిధులను ఆదేశించారు. హెచ్‌పీసీఎల్ పైపులైన్‌ను డ్రోన్‌లతో పర్యవేక్షించే అంశంపై పరిశీలించాలని ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. కర్మాగారాల్లో మాక్ డ్రిల్‌లు తరుచుగా నిర్వహించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి.. టోల్ ఫ్రీ నెంబర్ తదితర వివరాలను ప్రజలకు తెలిసేలా సమాచారాన్ని సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంచాలని, అలాగే వార్తా పత్రికల్లో ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ పాల్గొన్నారు.

బేరా టెస్టింగ్ కేంద్రం ప్రారంభం


బేరా టెస్టింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మే 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఈఎన్‌టీ ఓపీ విభాగంలో వినికిడి లోపాన్ని గుర్తించే సౌండ్ ప్రూఫ్ బేరా టెస్టింగ్ కేంద్రాన్ని సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేరా పరీక్ష ద్వారా రోగులకు వినికిడి లోపాన్ని గుర్తించి సమస్య తీవ్రత ఆధారంగా సర్జరీలు నిర్వహించవచ్చునన్నారు. అలాగే ఆసుపత్రిలో బేరా టెస్టు ద్వారా వినికిడీ లోపం, శ్రవణ నాడి రుగ్మతలు, వినికిడీ ప్రభా వితం చేసే ఇతర నాడీ సంబంధిత పరిస్థితులను నిర్ధారించడంలో సహాయపడుతుందన్నారు. ఈఎన్‌టీ రోగులకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంక టేశ్వర రావు, ఈఎన్‌టీ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ ఎం.వీర కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మమతాదేవి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల నగాంజన్ పాల్గొన్నారు.

ఏడేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

● ప్రాణాలను కాపాడిన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్సను వైద్యులుచేసి ప్రాణాలు కాపాడారు. ఎమ్మిగనూరు చెందిన ఏడేళ్ల బాలిక లిఖిత. ఏడాది వయస్సు గల రుచిత అక్కాచెల్లెలు. ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి ఇటుకలు ఇద్దరి మీద పడ్డాయి. దీంతో అక్కా చెల్లెళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఏడేళ్ల లికిత తలకు తీవ్ర రక్తస్రావం అయింది. చిన్నారి రుచిత కూడా తలకు గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు నుంచి వెంటిలేటర్లతో లికిత, చిన్నారి రుచితను ఈ నెల 16వ తేదీ కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. ఎమర్జెన్సీ వార్డులో ఇద్దరిని చేర్పించి న్యూరోసర్జన్ డా.విశ్వకుమార్ స్కానింగ్ నిర్వహించగా. ఏడేళ్ల బాలికకు తలలోని పుర్రెముక విరిగి మెదడులో గుచ్చుకుని తీవ్ర రక్తస్రావం అయినట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తరలించి పుర్రెను తీసివేసి బాలిక తలకు టైటానియం మ్యాకోప్లేట్‌ను అమర్చి ప్రాణాన్ని కాపాడారు. ఏడేళ్ల బాలిక పుర ఎముక స్థానంలో టైటానియం మెస్‌ను వేయడం చాలా అరుదని న్యూరో సర్జన్ డా.విశ్వకుమార్, పీడీయాట్రిక్ ఐసీయూ ఇన్‌చార్జి డా.మురార్జి, డా.కే.సింధూర రెడ్డి డా.మమత మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ క్లసర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఏడాది చిన్నారికి కూడా తల వాపు ఉండటంతో చికిత్స అందించినట్లు తెలిపారు.

రేపు క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

కర్నూలు కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ కర్నూలు 6వ ఎడిషన్ ప్రాపర్టీ ఎక్స్ పో ఎగ్జిబిషన్‌ను నగరంలోని ఎస్టీబీసీ కళాశాల క్రీడామైదానంలో శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర మేయర్ బీవై రామయ్య, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు హాజరు కానున్నారు. ఈ ప్రాపర్టీ షోలో దాదాపు 60 మంది బిల్డర్లు, నిర్మాణ వస్తువుల సరఫరా దారులు, ఇంటీరియల్ డిజైన్‌కు సంబంధించిన వారు పాల్గొంటున్నారు. స్పాన్సర్‌గా రాగమయూరి బిల్డర్స్, కో స్పాన్సర్‌గా స్కందాన్షి ఇన్‌ఫ్రా వారు వ్యవహరిస్తున్నారు. ఈ షోలో ఆటో పెవిలియన్ అదనపు ఆకర్ష ణగా నిలువబోతోంది. బుధవారం జె.సురేష్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. క్రెడాయ్ కర్నూలు చైర్మన్ గోరంట్ల రమణ, కన్వీనర్ ఎన్ శ్రీనివాసరావు, కార్యదర్శి పి. గోవర్ధన్ రెడ్డి, ట్రెజరర్ టీపీవీ ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్, మే 21(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. బుధవారం మండలంలోని తుంగభద్ర నదీతీరా గ్రామాలైన తిమ్మన దొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొదొడ్డి, ముడు మాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాలలో ఆయన పర్యటిం చారు. కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహి స్తోందని, తీర ప్రాంతాల రైతులు నదిలో ఏర్పాటుచేసుకున్న విద్యుత్ మోటార్లను బయటకు తెచ్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట వీఆర్వోలు ఉన్నారు.

దంచికొట్టిన వర్షం

● కోడుమూరు మండలంలో 47.6 మి.మీ
● పదునెక్కిన పొలాలు

కోడుమూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆరుబయట నిద్రిస్తున్న జనం ఇళ్లలోకి పరుగులు తీశారు. సుమారు గంటకుపైగా వర్షం పడడంతో డ్రైనేజీలు పొంగి పొర్లాయి. పంటకుంటలు, చెక్‌డ్యాంలు వర్షపునీటితో నిండిపోయాయి. గోరంట్ల వద్ద హంద్రీనదికి ఎగువ నుంచి వరద భారీగా పోటెత్తింది. దీంతో హంద్రీనదిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టిరోడ్డు కోతకు గురైంది. దీంతో అవతలి గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడుతూనే హంద్రీ దాటుతున్నారు. ఇక్కడ వరద నీటితో బైక్‌లు, ఆటోలు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో హంద్రీనదిలో వంతెన నిర్మాణం చేపట్టగా పెండింగ్


కుంగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు


గోరంట్ల వద్ద హంద్రీనదిలో కోతకు గురైన మట్టిరోడ్డు

బిల్లుల కారణంగా పనులు పిల్లర్ దశలో ఆగిపోయాయి. కాగా మే నెలలో వర్షాలు జోరందుకోవడంతో రైతన్నలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. పొలాలు పదునెక్కాయని విత్తుకు అవకాశం ఉందన్నారు. మండలంలో 47.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

లక్ష్మీపురంలో వర్షానికి కుంగిన బ్రిడ్జి

కల్లూరు: కార్పొరేషన్ పరిధిలోని 28వ వార్డు లక్ష్మీపురంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గంజి వాగుపై రైతులు కల్లాలకు వెళ్లే దారిలో బ్రిడ్జి కుంగింది. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు బుధవారం గ్రామానికి సందర్శించి బ్రిడ్జిని పరిశీలించారు. వర్షం నీటి ఉధృతికి గురై బ్రిడ్జి కుంగిందని, రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కమిషనర్ వెం ట జడ్పీ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, అధికారులు ఉన్నారు.

నేడు హనుమజ్జయంతి

జిల్లాలో వివిధ ఆలయాలు, ధార్మిక క్షేత్రాల్లో వేడుకలు

కర్నూలు కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకొని హనుమజ్జయంతి వేడుకలను గురువారం ఉమ్మడి జిల్లాలోని వివిధ దేవాలయాలు, ధార్మిక క్షేత్రాల్లో ఘనంగా నిర్వహించ నున్నారు. అందుకు ఆయా ప్రాంతాల్లో భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేశా రు. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవ స్థానం, హొళగుంద మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, గోనెగండ్ల మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, నందికొట్కూరు మండల కేంద్రంలోని రామాలయం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలి పారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామి వారికి పంచామృతా భిషేకం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణాలు, భజనలు, శోభాయాత్ర, ధార్మిక ప్రవచన బోధనలు ఉంటాయని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ ఏర్పాటు చేశామని వివ రించారు.


జగన్నాథగట్టుపై వెలసిన 62 అడుగుల హనుమాన్ విగ్రహం

● నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, గౌరవా ధ్యక్షులు కె. కృష్ణన్న, మోక్షేశ్వరుడు తెలిపారు. ఈ వేడుకను నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక పాఠశాల క్రీడామైదా నంలో ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

● జగన్నాథ గట్టుపై... నగర శివారు గుత్తిరోడ్డులో జగన్నాథగట్టుపై వెలసిన అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో గురువారం హను మజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ఉహనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని తెలిపారు.

● నగరంలోని వివిధ ఆలయాల్లో... నగరంలోని వివిధ ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, వన్‌టౌన్, అశోక్‌నగర్, బుధవారపేట బంగారుపేట, వీఆర్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయాల్లో, షరీన్‌నగర్ లోని సద్గురు త్యాగరాజ రామాలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి: జేసీ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, మే 21(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకునేలా చూడాలని పాణ్యం పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ పొలి టికల్ పార్టీ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ నవ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు పాణ్యం నియోజక వర్గంలో 1177 డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించామన్నారు. దాదాపు 500 నూతన ఓటర్లను నమోదు చేశామన్నారు. నియోజక వర్గంలో 1200 ఓట్లు దాటి ఉన్నటువంటి పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి అదనంగా ఉన్న ఓటర్లను ఫారం-8 ద్వారా ఒతర పోలింగ్ స్టేషన్లను బదిలీ చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం నవంబరు, డిసెంబరు, జనవరి మాసాలలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివాహం చేసుకుని వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, వలసలు వెళ్లినవారు తమ ఓటును బదిలీ చేసుకోవచ్చ న్నారు. పొలిటికల్ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ జరిపి డూప్లికేట్ ఓట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలని జేసీని కోరారు. కార్యక్రమంలో జనసేన, బీఎస్పీ, బీజేపీ, సీపీఎం పార్టీల నాయకులు మంజునాథ్, రామశేషయ్య, నాగరాజు, రామకృష్ణ, ఐఎన్‌పీ ఎస్. రజాక్‌వలి, కల్లూరు, పాణ్యం, గడివేముల తహసీల్దార్లు ఆంజనేయులు, నరేంద్రనాథ్‌రెడ్డి, వెంకటరమణ, ఓర్వకల్లు డీటీ రాజేష్, ఎలక్షన్ డీటీ తహసీల్దార్ జి.అనూరాధ పాల్గొన్నారు.

జానపద కథలతో సృజనాత్మకత


మాట్లాడుతున్న హరికిషన్

కర్నూలు కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చందమామ, బాలమిత్ర లాంటి జానపద కథలు చదివితే వారిలో సృజనాత్మకత పెరు గుతుందని ప్రముఖ బాలల కథా రచయిత, రాష్ట్ర కందుకూరి పురస్కార గ్రహీత డాక్టర్ ఎం.హరికిషన్ అన్నారు. పాత నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగుతున్న బాలల వేసవి వికాస తరగతుల్లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యంలో మనసులో నాటుకుపోయిన కథలు జీవితాంతం గుర్తుండిపోతాయని, కథల్లోని సృజనాత్మకత, రచనా శైలి, కథలు సాగే విధానం వల్ల విద్యార్థులకు మంచి భాష, సాహిత్యం పట్ల ఆసక్తి ఏర్పడు తాయని చెప్పారు. ఈ సందర్భంగా బాలలతో ఆయన వివిధ కథలపై చర్చించారు. మరో అతిథి ప్రజా గాయకుడు ఎంపీ బసవరాజు జానపద పాటల్లోని అంతర్యాన్ని తెలియజేశారు. పల్లెల్లో జనపదుల ద్వారా పుట్టిన జానపద గేయాలు, గీతాలు వారి శ్రామిక శక్తిని మర్చిపోయేలా, ఉత్సా హాన్ని నింపేలా ఉండేవని పలు ఉదాహరణ మధ్య వివరించారు. హాసిని మెడిటేషన్ తరగతులు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. నాగరాజు చరిత్ర, జీకే అంశాలు, యోగా మాస్టర్ జి.వెంకటేశ్వర్లు యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, లైబ్రేరియన్లు బాషా, వజ్రాల గోవిందరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం


సభ్యత్వ గుర్తింపు కార్డులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ నాయకుడు సృజన్, కౌన్సిలర్ బుడ్డండలి అన్నారు. బుధవారం గూడూరులో ఒకటో వార్డు పరిధిలోని కొత్తగేరిలో టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకున్న వారందరికీ సభ్యత్వ గుర్తింపు కార్డులను అందజేశామన్నారు. సభ్యత్వం పొందిన వారికి రూ.5లక్షల బీమా సదుపాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెస్తలకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్, మే 21(ఆంధ్రజ్యోతి): బెస్తలకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలని అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర కో-కన్వీనర్ టి. సాయిప్రదీప్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెస్త కార్యకర్తల సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పదవుల్లో నామినేటెడ్ పదవుల్లో బెస్తలకు న్యాయం చేయాలన్నారు. త్వరలో అఖిల భారత బెస్త మహాసభ కమిటీలు, గ్రామస్థాయిలో, మండల స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మత్స్యశాఖ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు, రాయలసీమ విద్యార్థియువజన పోరాట నాయకుడు బెస్త ఉదయ్, టీడీపీ బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు పీజీ వెంకటేశ్, టీడీపీ జిల్లా నాయకులు ఆనంద్‌రాజ్, రాష్ట్ర నాయకులు దేవలాపురం జయన్న, జిల్లా నాయకులు వెంకటే శ్వర్లు, టీడీపీ నగర బీసీ సెల్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు గ్యాస్ శ్రీని వాసులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయండి

సచివాలయ సిబ్బందికి కమిషనర్ ఆదేశం

కర్నూలు న్యూసిటీ, మే 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్రలో ప్రజలు భాగస్వాములు అయ్యేలా చూడాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సమావేశ మందిరంలో అడ్మిన్, అమినిటీస్, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21 వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యోగాంధ్ర యాప్‌లో సుముఖంగా ఉన్న వారి వివరాలను నమోదు చేయాలని, వచ్చే నెల 21న కర్నూల్లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పెద్దసంఖ్యలో ప్రజలు తరలి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

● అస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టండి

రాష్ట్ర వ్యాప్తంగా నగర, పట్టణాల్లో కొంత మంది యాజమానులు అధునాతన భవనాలు కట్టినా పాత ఇంటి బిల్లులు ఇంకా జనరేట్ అవుతున్నందున వాటిని పునః పరిశీలన ద్వారా సరి చేయాలని కమిషనర్ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. కొత్తగా భవనాలు నిర్మించినా, మొదటి అంతస్తు వరకు పన్ను వేసి, రెండు, మూడు అంతస్తులకు పన్నులు వేయకపోవడం, డాక్యుమెంట్లు సరిగా లేవని పన్నులు వేయకపోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని పునః పరిశీలించాలన్నారు. నగరంలోని పునః పరిశీలన ద్వారా రూ. 15.54 కోట్ల అదనపు ఆదాయం రావాల్సి ఉందన్నారు. ట్యాప్ కనెక్షన్లు సైతం పరిశీలించాలన్నారు. వచ్చే నెల 15 వరకు ఈసర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఆర్ఓ జునైద్, సూపరింటెండెంట్లు వాజిత్, ఆర్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. బుధవారం స్థానిక బీ.క్యాంపు క్రీడా మైదానంలోని వాలీబాల్ శిక్షకుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీ, తెలంగాణ తెలుగు రాష్ట్రాల అండర్-14 విభాగంలో బాలుర, బాలికల వాలీబాల్ పోటీలకు 19 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు డాక్టర్ శంకర్‌శర్మ బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నుంచి రమ్య, అనూష, దత్తు, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు కొండేపోగు చిన్న సుంకన్న, వాలీబాల్ క్రీడాకారులు శ్రీధర్, విశ్వం, స్వాములు, రమేష్, అఫ్జల్, అఖిల్, కళ్యాణ్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి: డీఎస్‌డీవో

కర్నూలు స్పోర్ట్స్, మే 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఎస్‌డీవో భూపతిరావు అన్నారు. బుధవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో సమ్మర్ క్యాంప్ చౌక్‌బాల్ క్రీడాకారులకు డీఎస్‌డీవో భూపతిరావు పాల్గొని చౌక్‌బాల్ క్రీడను పరిశీలించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, కోచ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి: జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారులు (బాలబాలికలు) సెంట్రల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. 2025-26 ఏపీ అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ పోటీ లకు హాజరయ్యే సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ క్రీడాకారులు జూన్ 15వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరా లకు 9866211480ను సంప్రదించాలన్నారు.

ప్రొఫెసర్ రాజ్‌కుమార్ మృతి తీరని లోటు


నివాళి అర్పిస్తున్న ఆర్‌యూ వీసీ

కర్నూలు అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): జువాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ టి.రాజకుమార్ మృతి తీరని లోటని ఉపకుల పతి వి.వెంకట బసవరావు అన్నారు. బుధవారం రాయలసీమ యూనివ ర్సిటీలోని కాన్ఫరెన్సు హాలులో జరిగిన సంస్మరణ సభలో ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్ర మంలో రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, ప్రొఫెసర్లు సుందరానంద పుచ్చా, సి. విశ్వనాథరెడ్డి, భరత్, కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

కర్నూలు అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశ సమాచార వ్యవస్థను అభివృద్ధికి పునాది వేశారన్నారు. మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, బజారన్న, జి.వెంకట శివరెడ్డి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ప్రమీల, వెంకట సుజాత, లాజరస్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కర్నూలు హాస్పిటల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీత, ఏపీ హంస రాష్ట్ర ఉమెన్స్ వింగ్ సెక్రటరీ డి.మంజుల దేవిని ఏపీ హంస కర్నూలు సిటీ యూనియన్ ఘనంగా సన్మానించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏపీ హంస సిటీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు టి.గోవిందుస్వామి అధ్యక్షతన సన్మానించారు. కార్యక్రమంలో సిటీ సెక్రటరీ చక్రిధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్లు మద్దూరు వెంకటస్వామి, ఏ.సంపత్ కుమార్, ఉపాధ్య క్షులు టి.సంపత్ కుమార్, కోశాధికారి టి.శివుడు, హెడ్ నర్సులు కే.లీలారాణి, కే.నిర్మల పాల్గొన్నారు.

రైతుల పక్షపతి కొల్లి నాగేశ్వరరావు

కర్నూలు న్యూసిటీ, మే 21(ఆంధ్రజ్యోతి): కొల్లి నాగేశ్వరరావు రైతుల పక్షపతి అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షుడు కె. జగ న్నాథం అన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏఐకేఎస్ నాయకులు కొల్లి నాగేశ్వరావు ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ కొల్లి నాగేశ్వర రావు కృష్ణా జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారన్నారు. బీటి పత్తి విత్తనాల ధరలు తగ్గించాలని సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసి రైతులకు కోట్లాది రూపాయల డబ్బులు ఆదా చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ, కర్నూలు నగర స హాయ కార్యదర్శి సి.మహేష్, రాముడు, మహిళా సంఘాల నాయకు రాలు రబియా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కర్నూలు హాస్పిటల్, మే 21(ఆంధ్రజ్యోతి): టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పసుపుల సచివాలయంలో జరుగుతున్న సంచార చికిత్సను ఆయన తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. తల్లులు, పిల్లలు నిర్దేశించిన ప్రకారం తప్పకుండా టీకాలు వేయిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి వైరస్‌లకు గురి కాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. డాక్టర్ హేమలత, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, పర్యవేక్షకురాలు నాగమణి, ఏఎన్ఎం ఎలిజిబెత్ ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తులు

ఆదోని టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటుకు పొదుపు మహిళల నుంచి పురపాలక శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండి, 21 నుంచి 40 సంవత్సరాల్లోపు ఉండి పొదుపు గ్రూపుకు చెందిన వారై ఉండాలని కమిషనర్ కృష్ణ బుధవారం తెలిపారు. స్థానికులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి, వివాహం చేసుకున్న మహిళలకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. ఇప్పటికే 40 దరఖాస్తులు అందాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం మెప్మా కార్యాలయ సిబ్బందిని కలవాలని సూచించారు.

ప్రజలందరికీ తాగునీరు ఇవ్వాలి

ఆదోని రూరల్, 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరీకి సక్రమంగా తాగునీరు ఇవ్వాలని డీఎల్‌పీవో నూర్జహాన్ తెలిపారు. సర్పంచ్ అర్లమ్మ మెయిన్ పైప్‌లైన్‌కు అక్రమంగా కొళాయి కనెక్షన్ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ కారుమంచి పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో బుధవారం నారాయణపురం గ్రామంలో ఈవోఆర్డీ జనార్ధన్, పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి విచారణ చేశారు.


విచారణ చేస్తున్న డీఎల్‌పీవో

పంచాయతీ దుకాణాలకు వేలాలు

పెద్దతుంబళంలో పంచాయతీ దుకాణాలకు డీఎల్‌పివో ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారు. దక్కించుకున్న వారు జూన్ 1వ తేదీలోగా చేరాలని సూచించారు. సర్పంచ్ ఉచ్చప్ప, ఈవోఆర్డీ జనార్ధన్, కార్యదర్శులు చంద్రశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ముస్లింలకు పథకాలు కొనసాగించాలి

మద్దికెర, మే 21 (ఆంధ్రజ్యోతి): వెనకబడ్డ ముస్లింలకు రంజాన్ తోఫా, ఇతర పథకాలను తిరిగి కొనసాగించాలని ఐటీడీపీ నాయ కులు హుసేన్‌పీరా కోరారు. బుధవారం మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేయాలని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందించిన లోకేశ్ ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అందేవిదంగా చూడాలనిసూచించారు.


లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న హుసేన్‌పీరా

రేషన్ వాహనాల రద్దు అన్యాయం

ఆదోని అగ్రికల్చర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసే వాహనాలను టీడీపీ ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం వాహన డ్రైవర్లతో మాట్లాడారు. వాహనాలపై ఆధారపడ్డ 18వేల మంది నిరుద్యోగులను రోడ్డున పడేశారని ఆరోపించారు.


మాట్లాడుతున్న సాయి ప్రసాద్ రెడ్డి

పట్టుదలతో ఉన్నతస్థాయికి చేరుకోవాలి

పత్తికొండ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని హైదరాబాద్ ఎంఎస్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ డా.సయ్యద్ హమీద్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువస్పందన సొసైటీ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు మోటివేషన్ తనగతులను నిర్వహించారు. బీఎస్ఎ న్ఎల్ విశ్రాంత అధికారి శివయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేశప్పను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, జాయింట్ సెక్రటరీ గిరీష్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డా. సయ్యద్ హమీద్

వైభవంగా రథోత్సవం

ఆలూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాత్రికి గ్రామం రంగస్వామి రథోత్సవం వైభవంగా బుధవారం జరిగింది. ఉదయం గంగిపూజ, పుష్పాలంకరణ, పంచామృతశేకం, కుంకు మార్చన, మహ మంగళ హారతి పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటలకు వందలాది రథోత్సవం సాగింది. కమిటీ చైర్మన్ హరిచంద్ర రెడ్డి, తహసీల్దార్ రమేష్ రెడ్డి, రామేష్, వీరంభద్ర రెడ్డి లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్లు డీలర్ రంగస్వామి రాజశేఖర్, గోపాల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

పత్తికొండ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు పెంచాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గత ఏప్రిల్ వేతనాలు ఇంకా జమ కాలేదని, తక్షణమే జమ చేయాలని కోరారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- మహానాడును జయప్రదం చేయండి
- వెల్దుర్తిలో నియోజకవర్గ మహానాడు


నాయకులకు గజమాల వేస్తున్న కార్యకర్తలు

వెల్దుర్తి, మే21 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి కార్యకర్తలు, నాయకులకు సూచించారు. బుధవారం వెల్దుర్తిలోని పార్టీ కార్యాలయంలో నాయకుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ మహానాడు ర్వహించారు. ముందుగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే శ్యాంబాబు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో వీరమ రణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో కేఈ కుటుంబానికి ఓ బ్రాండ్ ఉందన్నారు. చెరువులకు నీళ్లించిన ఘనత మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తికే దక్కుతుందన్నారు. తండ్రి ఆశయాలను ఎమ్మెల్యే శ్యాంబాబు నెరవేర్చి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రాజకీయాల్లో ఓపిక చాలా అవసరమని, కడపలో నిర్వహించనున్న మహానాడుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని 400 మెగావాట్ల సోలార్ పార్కు, గ్రీన్‌కో, హంద్రీనీవాకు 18 స్లూయిజ్‌ల ఏర్పాటుతో ఆయకట్టు పెరిగి ప్రతి రైతుకి సాగునీరు అందిస్తామన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ సాధారణ ఎంపీటీసీగా ఉన్న తాను పార్టీ పుణ్యమా అని ఎంపీగా గెలిచానన్నారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాటాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెర్లకొత్తూరు పుల్లయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, సుబ్బరాయుడు సాంబశివారెడ్డి, కన్వీనరు బలరాంగౌడ్, క్రిష్ణగిరి కన్వీనర్ మర్రి శ్రీరాములు, మార్కుట్‌యార్డు చైర్మన్ నబిసాహెబ్, జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

వడ్డీ రాయితీ జమ చేస్తాం

ఆలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): సొసైటీల నుంచి రుణాలు తీసుకుని సక్రమంగా వడ్డీ చెల్లించని రైతులకు 4 శాతం వడ్డీ రాయితీ జమ చేస్తామని ఆలూరు సహకార సొసైటీ సీఈవో వెంకటరెడ్డి బుధవారం తెలిపారు. 2023-24కు సంబంధించిన వడ్డీ రాయితీ అన్ని సొసైటీలకు కలిపి జమ చేశారని, సొసైటీల వారీగా జాబితా తయారు చేయడంలో సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైందన్నారు.

మినీ మహానాడుతో ఉత్సాహం

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, మే21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిర్వహించిన మినీ మహానాడు విజయవంతం కావడంతో కార్యర్తల్లో ఉత్సాహం వచ్చిందని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ బుధవారం అన్నారు. కార్యకర్తలు, నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. కడపలో నిర్వహించ నున్న మహానాడుకు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం


జొన్నగిరిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ


తుగ్గలి పోలీసుల క్వార్టర్స్ పరిశీలిస్తున్న ఎస్పీ

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- తుగ్గలి, మద్దికెరలో పర్యటన

తుగ్గలి, మే 21 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని, ఫిర్యాదుల పరిష్కారంలో పోలీసులు ముందుండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం జొన్నగిరి, తుగ్గలి పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలను తెలుసుకుని, పోలీసు క్వార్టర్స్ పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో క్రైం రేటు తగ్గించడానికి కృషి చేస్తున్నామని, మహిళా రక్షణ కోసం నిఘా ఉంచామన్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, రూరల్ సీఐ పులిశేఖర్, ఎస్ఐలు మల్లికార్జున, కృష్ణమూర్తి ఉన్నారు.

మద్దికెర: సాయంత్రం 7 గంటలకు మద్దికెర పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

క్యాంటీన్ పరిసరాల్లో శుభ్రత పాటించాలి

ఆదోని టౌన్, మే21(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని మునిసిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. బుధవారం అన్న క్యాంటీన్‌ను సందర్శించి, సిబ్బందికి సూచనలు చేశారు. వర్షాల కారణంగా ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.


సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

రీ సర్వేతో ఇబ్బందులు ఉండవు : తహసీల్దార్


నిట్రవట్టిలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్

హాలహర్వి, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న రీ సర్వేతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తహసీల్దార్ లక్ష్మి పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం నిట్రవట్టి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. చాలామంది రైతులు తమ వారసత్వ భూముల కొలతల్లో తేడాలు వచ్చాయని ఫిర్యాదు చేశారన్నారు. వాటి పరిష్కారానికే సర్వే చేస్తున్నామని, రైతులు తమ పొలాలకు సంబంధించిన పత్రాలు సమర్పించి భూ సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగప్ప, సర్వేయర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి ఉద్యమించాలి


కేక్ కట్ చేస్తున్న బీసీ ఫెడరేషన్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే 21 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతి కోసం ఉద్యమించాలని బీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అన్నారు. బుధవారం బీసీ ఫెడరేషన్ మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాధికారం కోసం ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. అనంతరం గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన ఎం.కృష్ణను సన్మానించారు. దేవిశెట్టి ప్రకాష్, దనాపురం శేషన్న, హను మంతరావు, షేక్షావలి, వీరభద్ర, రామకృష్ణ, రాందాస్ మల్లేషప్ప పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి

ఆదోని టౌన్, మే21(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు చిత్రపటానికి నివాళి అర్పించి, రాజీవ్ సేవలను స్మరించుకున్నారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ మొదటిసారి కంప్యూటర్ రంగాన్ని పరిచయం చేయడంతోనే ప్రస్తుతం లక్షలాదిమంది యువత ఉపాధి పొందుతున్నారన్నారు. మైనార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్, తాయన్న, నెట్టేకల్ హనుమంతు, హుస్సేన్ బాష, ఖలందర్, అర్బాజ్, ఐఎన్‌టీయూసీ జయరాం పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నాయకులు

పండ్ల తోటలపై దృష్టి సారించాలి

తుగ్గలి, మే 21 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఆయన ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ రైతులకు వందశాతం సబ్సిడీ అందుతుందన్నారు. ఆఇరకి అవగాహన కల్పించాలన్నారు. అలాగే పనులు కోరిన ప్రతి కూలికి ఉపాధి పనులు కల్పించాలని, పనులకు రాని వారి పేర్లు మస్టరులో చేర్పిస్తే సిబ్బందిపై చర్యల తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఈసీ రాజశేఖర్, టీఏలు ఫరీదప్ప, రామకృష్ణ, చంద్ర తదితరులు ఉన్నారు.

వేలాలు వాయిదా

ఆదోని టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టన ప్రధాన రహదారిలోని మున్సిపల్ దుకాణాలు వేలేలు వాయిదా వస్తున్నట్లు కమిషనర్ కృష్ణ తెలిపారు. మూడేళ్ల లీజుకు 26 దుకాణాలను వేలం వేయాల్సి ఉందన్నారు. తిరిగి వేలాలు ఎప్పుడు నిర్వహించేదీ నోటీసు బోర్డులో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

నారాయణరెడ్డి సేవలు మరువలేనివి

మద్దికెర, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు దివంగత చెరుకుల పాడు నారాయణరెడ్డి సేవలు మరువలేనివని, జడ్పీటీసీ సభ్యుడు మురళిధరెడ్డి, మాజీ సర్పంచ్ శాంతన్న అన్నారు. బుధవారం పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్ ఆధ్వర్యంలో వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్, 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకూల్లురు గ్రామ సమీపంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వి పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ఆదోనికి ఇంద్ర నగర్‌కు చెందిన బోయ వీరేష్ ఆటోలో మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఆటో సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు.

సారా తయారీ బెల్లం అమ్మితే చర్యలు

పత్తికొండ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): సారా తయారీకి ఉపయోగించే బెల్లాన్ని అమ్మితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని జె.ఎం.తండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. గ్రామానికి చెందిన రంగానాయక్, పుల్లమ్మ నిల్వ ఉంచిన సారా బెల్లంను స్వాదీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. బెల్లం అమ్మిన దేవనకొండకు చెందిన వ్యాపారి చిట్టెం చంద్రశేఖర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బెల్లం కొనుగోలు చేసిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

బైక్ ఢీ.. ఆవు మృతి

- మహిళకు తీవ్ర గాయాలు

ఆలూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హులేబీడు గ్రామ సమీపంలో బళ్లారి నుంచి ఆదోనికి వస్తున్న బైక్ ఢీ కొని ఆవు ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న కృష్ణ లక్ష్మి ఆదోనికి చెందిన వ్యక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాగా లక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాగి నడిపితే కేసులు

ఆలూరు/ఆలూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మహబూబ్ బాషా హెచ్చరించారు. బుధవారం ఆలూరులో వాహనాలను తనిఖీ చేశామని, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసి, జరిమాన విధించామని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రవిశంకర్‌రెడ్డి నేతృత్వంలో మూడు నెలల్లో 150 కేసులు నమోదు చేశామన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

మద్దికెర, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇమాంసాహెబ్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మింగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వైద్యసేవలు అందుబాటులో ఉంచామన్నారు. ఎంఈవో రంగస్వామి తదితరులు ఉన్నారు.

స్ప్రింక్లర్లు, పైపుల చోరీ

మద్దికెర, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులోని తన తోటలో రూ.50వేలు విలువ చేసే 30 స్ప్రింక్లర్లు, 30 పైపులను దొంగలు ఎత్తుకెళ్లారని కౌలు రైతు మహమ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. గుంతకల్లుకు చెందిన మహమ్మద్ మద్దికెర గ్రామ శివారులో తోటలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. సాగుకు ఉపయోగించే స్ప్రింక్లర్లు, పైపులను ఒక గదిలో భద్రపరిచి గుంతకల్లు వెళ్లాడు. అయితే బుధవారం ఉదయం వచ్చి చూడగా బండలు పగల కొట్టి స్పింకర్లు, పైపులు ఎత్తుకెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందదించిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు మండల సమావేశం

పత్తికొండ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కవిత తెలిపారు. బుధవారం మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వివిద శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

హాలహర్వి, మే 21(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆరుగురు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో వరలక్ష్మి బుధవారం తెలిపారు. విరుపాపురం, కొక్కరచేడు, గూళ్యం-1, 2, కామినహాల్, బేవినహాల్ గ్రామాల ఉద్యోగులు గృహ నిర్మాణ పనుల్లో వెనకబడ్డారన్నారు. రెండు రోజుల్లో వేగవంతం చేయకపోతే కలెక్టర్ తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులు తీసుకున్న ఉద్యోగులు అప్రమత్తం కావాలని సూచించారు.

డాబాల్లో ఫుల్లు కిక్కు

- గుట్టుచప్పుడు కాకుండా మద్యం సరఫరా
- తాగి నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న డ్రైవర్లు
- మామూళ్ల మత్తులో పోలీసు, ఎక్సైజ్ అధికారులు

పట్టణ శివార్లలోని జాతీయ రహదారితోపాటు, ఇతర రహదారుల పక్కనే ఉన్న డాబాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. వాహనచోదకులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీన్ని అరికట్టాల్సిన పోలీసు, ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఆదోని, మే 21 (ఆంధ్రజ్యోతి): దారి పక్కనే డాబా, అందులో మద్యం ఇంకేముంది డ్రైవర్లు మత్తులో మునుగుతున్నారు. కర్నూలు, అనంతపురం, బళ్లారి వెళ్లే జాతీయ రహదారుల్లో నిత్యం భారీ వాహనాలతోపాటు, ఇతర వాహనాలు సైతం వెళ్తుంటాయి. రహదారుల వెంబడి సుమారు 40వరకు డాబాలు ఉన్నాయి.

డాబాల్లో జోరుగా సిట్టింగ్‌లు

డాబాల్లో మద్యం విక్రయించడం చట్ట విరుద్ధం. అయితే డాబా నిర్వాహకులు ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా డాబాల్లో జోరుగా మద్యం సిట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. తాగేందుకు ప్రత్యేకంగా గదులను కూడా ఏర్పాటు చేసి అందులో ముక్క, మద్యాన్ని కూడా అందిస్తున్నారు.

ప్రమాదాలకు కారణమవుతున్న మద్యం

డాబాల్లో మద్యం సేవిస్తున్న డ్రైవర్లు అనంతరం అలాగా వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణ మవుతున్నారు. కొంతమంది డాబాల నిర్వాహ కులు మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని తీసుకొస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా కొంతమంది వాహనదారుల మద్యం బాటిళ్లను బయట నుంచి తెచ్చుకొని తాగుతున్నారు. తర్వాత వారు మద్యం మత్తులో వాహనాలను అతివేగంతో జాతీయ రహదారిపై నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ప్రమాదాలలో ప్రాణనష్టం జరగడమే కాకుండా అనేక మంది క్షతగాత్రులు అవుతున్నారు.

అంతంతమాత్రం తనిఖీలు

డాబాల్లో ఇలా యథేచ్ఛగా మద్యం తాగుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అప్పుడప్పుడూ నామమాత్రంగా తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. ఆస్పరి, ఎమ్మిగనూరు, ఆలూరు, శిరుగుప్ప రహదారికి ఇరువైపులా ఉన్న డాబాలపై పోలీసు, ఎక్సైజ్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే డాబాల్లో తనిఖీకి వెళ్లేముందు వారికి ముందుగానే సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నిర్వాహకులు అప్రమత్తమై, అప్పటికప్పుడు మద్యం లేకుండా జాగ్రత్త వహిస్తున్నట్లు అవుతున్నారు. దీన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ సైదుల్లాను వివరణ కోరగా డాబాల్లో మద్యం తాగడానికి వీల్లేదని, తనిఖీలు చేస్తున్నామని, కూడా కేసులు నమోదు చేస్తున్నామని, చర్యలు తీసుకుంటామన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం


మధ్యాహ్నం 12 గంటలు దాటినా ప్రారంభంకాని సమావేశం

ఎమ్మిగనూరు రూరల్, మే21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజా సమస్యల గురించి చర్చించే సర్వసభ్య సమావేశంపై అటు ప్రజా ప్రతినిధులకు గాని, ఇటు అధికారులకు గాని ఏ మాత్రం బాధ్యత లేకుండ పోయింది. ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడంతో మధ్యాహ్నం 12గంటలు దాటినా సమావేశం ప్రారంభం కాలేదు. సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులతో గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సి ఉంది. అయితే ఉదయం 11.30గంటలకు కొంతమంది మాత్రమే ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చారు. సమావేశానికి రావాల్సిన ముఖ్య అధికారులు హాజరు కాకపోవడంతో వచ్చిన వారు కూడా ఇంకెంతసేపటికి సమావేశాన్ని ప్రారంభిస్తారని చర్చించుకోవడం కనిపించింది. సర్వ సభ్య సమావేశంలో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించి గ్రామాలకు కావాల్సిన నిధుల మంజూరుతో పాటు అత్యవసర సేవలపై చర్చించాల్సి ఉంది. కాని బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం మాత్రం తూతూ మంత్రంగా జరగడంతో ఇదేమి సమావేశమని కొంతమంది అధికారులతో పాటు, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు చర్చించుకోవడం గమనార్హం.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రైతులు

మంత్రాలయం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామంలో 295ఏ2 సర్వే నెంబరులో 2.90 ఎకరాల భూమి గురు రాఘవేంద్ర రిజర్వాయరు పరిధిలోకి అప్పటి అధికారులు చేర్చారు. దీంతో రైతులు పొలం హక్కులు కోల్పోవాల్సి వచ్చింది. ఐదేళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదు. దీంతో మాలపల్లికి చెందిన గువ్వల భీమన్న, చాకలి ఈరన్న, పల్లెపాడు హనుమంతు, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజావేదిక సందర్భంగా స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్, సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సహకారంతో తహసీల్దార్ ఎస్.రవి సమస్యను పరిష్కరించి న్యాయం చేశారు. దీంతో రైతులు శాలువ, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

జీడీపీకి చేరిన వరద


జీడీపీలో ఉన్న వరద నీరు

గోనెగండ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కు కొద్దిపాటి వరద వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 373.32 అడుగుల నీరు ఉంది. ఇప్పుడు పది సెంటీమీటర్ల వరద నీరు వచ్చి చేరింది. రెండు రోజులుగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, జొన్నగిరి తదితర ప్రాంతాల్లో అడపాదడపా వర్షాలు కురియడంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీరు పైగా నే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీటి ఇబ్బందిలేనట్లేనని తెలుస్తోంది.

నీటికుంట పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

నందవరం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలో నీటికుంట పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. బుధవారం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై అధికారులతో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో నీటి కుంట పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. అలాగే సన్నకారు, రైతులు పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపేలా చూడాలన్నారు. ఉపాధి కూలీలకు తగిన వేతనం పడేలా చూడాలని తెలిపారు. ఎండకాలం కావడంతో 11 గంటల కంతా ఉపాధి పనులు ముగిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎఫ్ఎ, మేటీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ వాసులు తమ కాలనీలో సీసీ రోడ్లు లేక వర్షపు నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు, న్యూ ఎస్సీ కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తక్షణమే అధికారులు కాలనీలో సీసీ రోడ్లు వేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సత్యన్న డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు బాలరాజు, బాబు, సులోచన, మేరి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త..

- దిగుబడి తగ్గి రూ. కోట్లలో నష్టపోతున్న రైతులు
- విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి
- ప్యాకింగ్ ఉన్న విత్తనాలు కొంటేనే మేలు అంటున్న వ్యవసాయశాఖ అధికారులు

గోనెగండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానలు ముందే పడడంతో ఖరీఫ్ సీజన్ కూడా ముందుగానే ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని చాల మండలాల్లో రైతులు మిరప, పత్తి, వేరుశనగ, ఉల్లి, తదితర పంటలను సాగుచేస్తున్నారు. అయితే సాగులో కీలకమైన భూమికను పోషించే విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాల్సి ఉంది. లూజు విత్తనాలను అమ్మేందుకు దళారులు సిద్దమవుతుండటంతో రైతులు అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లూజు విత్తనాలకు బదులు ప్యాకెట్ లో ఉన్న విత్తనాలను కోనుగోలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. గత ఏడాది ఆదోని డివిజన్‌లో నకిలి పత్తి, మిరప, ఉల్లి విత్తనాల కారణంగా చాల మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయి. డివిజన్ స్థాయిలో దాదాపు పది వేల ఎకరాల్లో పంటనష్టం జరిగి కోట్ల


అమ్మకానికి ఉంచిన లూజు విత్తనాలు

రూపాయలు రైతులకు నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో గోనెగండ్ల మండలంలోని బైలుప్పల, గంజహళ్లి, హెచ్. కైరవాడి, అలువాల, కులుమాల, వేముగోడు, తిప్పనూరు తదితర గ్రామాలలో కొందరు అక్రమంగా లూజు విత్తనాల వ్యాపారం చేసేవారు. చెన్నై నుంచి పలు రకాల కంపెనీలకు చెందిన కవర్లను తీసుకువచ్చి వాటిలో నాసిరకం విత్తనాలను నింపి సీజ్ చేసి అమ్మకాలు జరిపేవారు. కొంత కాలంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంతో సమస్య కొంత తగ్గిందని, అయితే మళ్లీ కొందరు లూజు విత్తనాలను అమ్మకానికి సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కాబట్టి రైతులు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లూజువిత్తనాలు అయితే

ప్యాకెట్లలో కాకుండా విడిగా విత్తనాలను కొనుగోలు చేస్తే ఆ విత్తనాలలో నాణ్యత ఉండదు. ఈ విత్తనాల తయారీలో కంపెనీకి చెందిన ధృవీకరణ అధికారులు ప్రమేయం ఉండదు. లూజు అమ్మకాలు జరిపేవారి దగ్గర విత్తనాలు కొన్న రైతులకు ఎటువంటి బిల్లు ఇవ్వరు. ప్రాసెసింగ్, విత్తన శుద్ధి ఇతర ప్రమాణాలు ఉండవు. ఈ విత్తనాలు విత్తినప్పుడు పంట మధ్యలో పూత, కోత దశలలో ఏమైనా నష్టాలు జరిగితే అమ్మకాలు జరిపిన వ్యక్తి బాధ్యత వహించడు. దీంతో రైతుకు న్యాయం జరగదు. ముఖ్యంగా ఈ విత్తనాలకు జన్యు నాణ్యత ఉండదు.

గుర్తింపు పొందిన కంపెనీకి చెందిన ప్యాకెట్లు అయితే

వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు అయితే ఎంతో మంచివి. అమ్మే విత్తనాలు నాణ్యమైనవిగా ఉంటాయి. ఈ విత్తనాల తయారీలో వివిధ దశలలో ధృవీకరణ అధికారులు పాల్గొంటారు. విత్తన తయారి ప్రాసెసింగ్, శుద్ధి తప్పక పాటిస్తారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పక ఇస్తారు. ఆ తరువాత రైతుకు నష్టం వాటిల్లితే పరిహారం అందుకునేందుకు వీలుంటుంది. వ్యవసాయ శాఖ సిబ్బందితో అనుమతి పొందిన లైసెన్స్ దుకాణాల్లో మాత్రమే మిరప, పత్తి, వేరుశనగ, ఇతర విత్తనాలు కొనుగోలు చేయాలి. దుకాణాదారుడి నుంచి తప్పని సరిగా బిల్లు తీసుకోవాలి. పంట కాలం పూర్తి అయ్యే వరకు వాటిని భద్రంగా ఉంచుకోవాలి.


లైసెన్స్ ఉన్న దుకాణాల్లోని విత్తనాలు

లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దు



గ్రామాల్లో చాల వరకు గుర్తు తెలియని వ్యక్తులు లూజు విత్తనాలను అమ్మకాలు జరపడానికి వస్తుంటారు, వారి దగ్గర ఎట్టి పరస్థితుల్లో విత్తనాలు కొనకూడదు. ఎవరైనా అక్రమంగా లూజువిత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే మాకు సమాచారం అందజేయాలి. విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటిస్తే సాగుకు ముందే జరిగే నష్టాన్ని అన్నదాత నివారించుకోవచ్చును.

\- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

పోలీసులు ఎక్కడ?


ప్రమాదకరంగా ఆటోపై ప్రయాణం చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణం నుంచి గ్రామాలకు నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు అంటున్నారు. ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే ఆటోల్లో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా ఆటోపైన ప్రమాదకరంగా కుర్చోపెట్టుకుని ఆటోడ్రైవర్లు తమ స్వలాభం చూసుకుంటున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వీరిపై పోలీసుల నిఘా లేనందునే ప్రమాదాలు రోజురోజుకీ అధికమవుతున్నాయి. పోలీసులు చర్యలు తీసుకుని ప్రమాదాలు అరికట్టాలని పట్టణ ప్రజలు కొరుతున్నారు.

ఆంజనేయస్వామి దేవాలయం ప్రారంభోత్సవం


నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయం

నేడు మంత్రాలయం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం, చెట్నహల్లి గ్రామాల మధ్య మెహినీపురం వద్ద దాదాపు రూ.4 లక్షలతో నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఉరుకుందు, నాగేంద్ర తెలిపారు. ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసి దాదాపు మూడేళ్లు కావస్తున్నా, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దుమ్మూ దూళీతో నిండి ఉండేది. గమనించిన చెట్నహల్లి గ్రామానికి చెందిన ఉరుకుందు, నాగేంద్రతో పాటు గ్రామస్థులు, రాంపురంరెడ్డి సోదరులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, ప్రదీప్ రెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి ప్రోత్సాహంతో దాదాపు రూ.4 లక్షలు ఖర్చు చేసి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. హనుమాన్ జయంతి గురువారం రోజున ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు చేసి ఆలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేషన్ పంపిణీలో మార్పుపై డీలర్ల హర్షం


క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

ఎమ్మిగనూరు రూరల్, మే21(ఆంధ్రజ్యోతి): ప్రతినెల పేదలకు సరఫరా చేసే రేషన్ సరుకుల సరఫరాను రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ డీలర్ షాపులకు అప్పజెప్పడం అభినందనీయమని డీలర్ల అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు సోములగూడూరు బాషా అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ ముందు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, నాదేండ్ల మనోహర్, నారా లోకేశ్‌ల కు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు ఈరన్న, రామకృష్ణ, నాగూర్‌బాషా, సురేంద్రగౌడు, తాయప్ప, రాము, రాబియా, రంగన్న, వెంకటేషప్ప, ఆదెన్న, శివరాజ్ పాల్గొన్నారు.

పెద్దమరివీడులో అపరిశుభ్రత

గోనెగండ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో అపరిశుభ్రత నెలకొంది. గ్రామంలోని చెత్త చెదారం మురికి కాలువల్లో పెరుకు పోవడంతో దోమలు ఈగలు కారణంగా అంటు రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షం కారణంగా మురుగునీరు అంతా రోడ్లపై చేరింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యంతోనే ఆస్పత్రి ఆలస్యం

● కూటమి ప్రభుత్వంలో మెరుగైన వైద్యసేవలు ● వంద పడకల ఆసుపత్రి ప్రారంభం ● క్రిటికల్ కేర్ యూనిట్ తీసుకొస్తాం- ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మే21(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ఐదేళ్ల వైసీపీ నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆరోపించారు. పట్టణంలో రూ. 12.60కోట్లతో 50పడకల సీహెచ్‌సీ నుంచి 100పడకల ఏరియా ఆసుపత్రిగా ఆధునీకరించిన భవనాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వందపడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు నాబార్డు నిధులు మంజూరు చేయించానని తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి నిర్మించేందుకు ఐదేళ్లు కాలయాపన చేస్తు వచ్చిందని, దీంతో నిరుపేదలకు వైద్యం అందలేదని విమర్శించారు. టెక్స్‌టైల్ పార్కు పూర్తయితే ఎంతో మంది చేనేతలకు ఉపాధి లభించటమే గాక ఎంఎస్ఎంఈ ద్వారా ఎంతో మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు తెచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబేనన్నారు. ఎమ్మిగనూరు పట్టణానికి అవుటర్ రింగ్ రోడ్డు వస్తుందన్నారు. స్థానిక వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులపై కేర్ తీసుకొని మంచి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ డా శ్రీనివాసులు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. సుధా, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైద్యులు మల్లికార్జున బాలీజీ, చిరంజీవి, హెచ్‌డీసీ డైరెక్టర్లు రామకృష్ణ నాయుడు, సురేష్ చౌదరి, అంబేడ్కర్, కౌన్సిలర్ రామదాసుగౌడ్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, కురువ మల్లయ్య, విరుపాక్షి రెడ్డి, భాస్కర్, మహేంద్రబాబు, శివశంకర్, రంగస్వామి గౌడ్,వహాద్, గిరి, నరసప్ప, ఉసేన్‌పీరా, అన్నపూర్ణమ్మ, బీజేపీ, జనసేన నాయకులు నరసింహులు, భాస్కర్ పాల్గొన్నారు.


ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న బీవీ జయనాగేశ్వర రెడ్డి

రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, మే 21 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛ రణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేందస్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ వైభవంగా నిర్వహించారు. వైశాఖ బుధవారం నవమి శుభ దినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృ తాభిషేకం నిర్వహించారు.


బృందావనానికి హారతులిస్తున్న పీఠాధిపతి

●రాఘవేంద్రుని సన్నిధిలో కర్నూల్ మహిళా అడిషనల్ న్యాయాధికారి

రాఘవేంద్ర స్వామిని కర్నూల్ మహిళా కోర్టు అడిషనల్ జిల్లా న్యాయాధికారి వి. లక్ష్మీరాజ్యం కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట అనంతపురాణిక్, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజిల్, ద్వారపాలక అనంతస్వామి, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రాలయంలో హనుమాన్ జయంతి ఊరేగింపు

మంత్రాలయంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కొండాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గంగపుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య తెలిపారు. అనంతరం స్వామివారిని ఊరేగింపును కలశాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని కోరారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

పెద్దకడబూరు, మే21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో ఈనెల 11న కురువ మహాదేవ, గుడిసె రంగమ్మల ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటనపై పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ముచ్చగిరి గ్రామంలో దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముచ్చగిరి గ్రామానికి చెందిన బోయ ఉరుకుందు, నూగూరు హరికృష్ణ, బోయ నరసింహులు కురువ మహాదేవ, గుడిసె రంగమ్మల ఇంట్లో 24గ్రాముల బంగారు, 24తులాల వెండితో పాటు రూ.51వేల నగదును దొంగలించారన్నారు. నిందితుల నుంచి నగదు, బంగారు రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నాగరాజు, శరణప్ప, భాస్కర్, హోంగార్డు గోపాల్ పాల్గొన్నారు.

వాల్మీకి సంక్షేమ భవనానికి నిధులు


ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాల్మీ సంఘం నాయకులు ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డిని స్వగృహం నందు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు కోండయ్య, లచ్చన్న, నారాయణ మాట్లాడుతూ పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన మినీ మహానాడు సభలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వాల్మీకి సామాజిక వర్గ సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం తన తండ్రిగారు వాల్మీకులకు కేటాయించిన స్థలంలోనే వాల్మీకి బోయ సంక్షేమ భవన నిర్మాణం కోసం రూ.75 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారని అన్నారు. వాల్మీకి పెద్దలతో కమిటీ ఏర్పాటు చేసి మంచి సంక్షేమ భవనం నిర్మించడానికి త్వరలోనే కార్యచరణ మొదలు పెడతానని తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో యాపిలయ్య, మునిస్వామి, నాగేష్ పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టడం దారుణం

ఎమ్మిగనూరు రూరల్, మే21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంతో పేదల కడుపులు కొట్టడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న యాదవ్, సీపీఐ మంత్రాలయం నాయకులు భాస్కర్‌యాదవ్‌లు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ సరుకులను పేదలకు అందజేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దాదావలి, ఏసీ జబ్బార్, మల్లికార్జునగౌడ్, ఇస్మాయిల్, నరసింహులు, సుంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

ఎమ్మిగనూరు రూరల్, మే21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు విష్ణు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీను, రవి, పరమేష్, రాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇద్దరు మృతి

మంత్రాలయం, మే 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చమర్రి గ్రామానికి చెందిన హనుమంతప్ప (58), మంత్రాలయం రామచంద్రనగర్‌కు చెందిన బాలరాజు(56) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, గుర్రెడ్డి భీమిరెడ్డి, సీపీ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, టీడీపీ నాయకులు, అడ్వకేట్ విజయ్‌కుమార్, జనసేన మండలనాయకులు ఏసేపు, శివప్ప ,వీరేష్, జడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీటీసీ మజ్జిగ నరసమ్మ, సర్పంచ్ మేకల సుజాత, పాల్గొన్నారు.